ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 31.12.2025 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ మహా నగరాన్ని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేం దుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

2. సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలకు టోల్ ఫీజు లేకుండా అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

3. మేడారం సమ్మక్క , సారలమ్మ దేవతల దర్శనానికి ముందస్తుగా వ స్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అధికారుల ను ఆదేశించారు.

4. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు , వార్డు సభ్యుల స్థానాల్లో గణనీయంగా బిజెపి మద్దతుదారులు గెలవడంపై తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అభినందించారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

**రేవంత్**

హైదరాబాద్ మహా నగరాన్ని కాలుష్యరహితంగా తీర్చిదిద్దబోతున్నామని... ఇందులో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 'కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ' (క్యూర్) ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కమాండ్

కంట్రోల్ సెంటర్లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై నిన్న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా `క్యూర్' ప్రాంత ప్రక్షాళనపై జోనల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. `క్యూర్' పరిధిలోని నగరాన్ని 12 జోన్లు , 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని , కొత్త జోనల్ కమిషనర్లు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నెలకు మూడు రోజులు పారిశుద్ధ్యం మెరుగుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.

జీఎస్

**టోల్**

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై టోల్ ఫీజు లేకుండా రవాణాకు అనుమతివ్వాలని తెలంగాణ రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. జనవరి 9 నుంచి 14 వరకు హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో , జనవరి 16 నుంచి 18 వరకు విజయవాడ-హైదరాబాద్ మార్గంలో.. టోల్ రుసుము లేకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. సంక్రాంతి పండుగ రోజుల్లో 200 శాతం అధికంగా ట్రాఫిక్ రద్దీ ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

జీఎస్

**సీతక్క**

ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క , సారలమ్మ దేవతల దర్శనానికి ముందస్తుగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని , వనదేవతల కీర్తిని ప్రపంచం గుర్తించేలా జాతర నిర్వహణ ఉండాలని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహాజాతర ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ములుగు గట్టమ్మ ఆలయాన్ని సందర్శించారు. మేడారం వచ్చే భక్తులు ముందుగా గట్టమ్మ ను దర్శించుకుంటారని , అక్కడ ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఊరట్టం , కాల్వపల్లి, కన్నెపల్లి, మేడారంలలో పర్యటించి , పనుల్లో వేగం పెంచాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్నిశాఖల పనుల పురోగతిని అడిగి తెలుసుకొన్నారు.

పిటిసి, ములుగు

**ఉత్తమ్**

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ శాసన సభ్యులు హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవాల ప్రాతిపదికన ఆయన ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ప్రాజెక్టులకు సంబంధించి ఇంజినీర్లతో నిన్న సమావేశం నిర్వహించిన మంత్రి.. అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న పోలవరం-బనకచర్ల , నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రాజకీయంగా , న్యాయపరంగా అడ్డుకుంటోందన్నారు. వివాదాస్పద లింక్ ప్రాజెక్టుపై ఈనెల 16న సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశామన్నారు.

డెస్క్

**యూరియా**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియాను పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయాధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించామని చెప్పారు. యూరియా అక్రమ నిల్వలు , బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయంలో మంత్రి యూరియా సరఫరాపై నిన్న సమీక్షించారు. రాష్ట్రంలో యాసంగికి యూరియా కొరత లేదని , కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందని అన్నారు. రైతులు భయాందోళనకు గురికావద్దని కోరారు. సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాని మంత్రి తెలిపారు.

డెస్క్

**ఆధార్ తేడా**

రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు అందుకుంటున్న ఉద్యోగుల వివరాల్లో తేడాలను ఆర్థికశాఖ గుర్తించింది. ఇప్పటివరకు 10 లక్షలకు పైగా ఉద్యోగుల పేర్లను , ఆధార్, ఫోన్ నంబర్లను పోల్చి చూడాలని ఆర్థికశాఖ.. భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ)కు

పంపగా.. మొత్తం 4 లక్షల మంది ఉద్యోగుల ఆధార్ కార్డుపై ఉన్న పేరుకు , వేతనం పొందుతున్న రికార్డులో ఉన్న పేరుకు తేడాలున్నాయని తేల్చింది.

డెస్క్

**గ్రూప్ 1**

గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో విచారణ నిన్న ముగిసింది. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ , మూల్యాంకనం తదితరాలకు సంబంధించిన వివాదంపై ఇరు వైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం వచ్చేనెల 22వ తేదీన తీర్పు వెల్లడిస్తామని తెలిపింది.

డెస్క్

**బదిలీలు**

వాణిజ్య పన్నుల శాఖలో 33 మంది అధికారులను బదిలీ చేస్తూ కార్యదర్శి రఘునందన్‌రావు నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 12 మంది జాయింట్ కమిషనర్లు , 21 మంది కింది స్థాయి అధికారులు ఉన్నారు.

డెస్క్

**పులి**

కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచరించిందనే సమాచారంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణితో ఫోన్లో మాట్లాడి రైతులు , స్థానికులు భయపడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలు గుర్తించినట్లు కేంద్ర మంత్రికి బాలమణి వివరించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి పులి ఇక్కడికి వచ్చిందని అన్నారు.

పిటిసి, కరీంనగర్

**వీధి కుక్కలు**

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వీధి కుక్కల కట్టడికి వివిధ ప్రభుత్వ విభాగాలు తగిన చర్యలు తీసుకునేలా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు , సంస్థలు క్రుషి చేయాలని జాతీయ వైద్య కమిషన్ నిన్న ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలు , కళాశాలలు, మైదానాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు సహా బహిరంగ ప్రదేశాల్లో శునకాల కట్టడికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి , ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించాలని , ఆసుపత్రుల్లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని గతనెలలో సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అన్ని వైద్య కళాశాలలు, సంస్థలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ వైద్య కమిషన్ ద్వారా ఆదేశాలు జారీ చేసింది.

డెస్క్

**బీజేపీ**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నిన్న ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవహారాలపై చర్చించినట్లు రామచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో గణనీయంగా సర్పంచులు , వార్డు సభ్యుల స్థానాల్లో పార్టీ మద్దతుదారులు గెలవడంపై జేపీ నడ్డా అభినందించారని అన్నారు.

జీఎస్

**కూనంనేని**

ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలను పది రోజులపాటు నిర్వహించాలని సీపీఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు.. శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు నిన్న రాసిన లేఖలో కోరారు. సభలో ప్రతిరోజు చర్చించే అంశాల ఎజెండాను ముందురోజు సాయంత్రానికల్లా అందిస్తే వాటిపై సమాచారం సేకరించుకుని సన్నద్ధం అయ్యేందుకు వీలుంటుందని ఆయన తెలిపారు.

డెస్క్

**సజ్జనార్**

కొత్త సంవత్సర వేడుకల్లో మద్యం తాగి వాహనాలతో రోడ్ల పైకి వచ్చిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. నగరంలోని 120 ప్రాంతాల్లో ఇవాళ రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని చెప్పారు. జైలు శిక్ష , డ్రైవింగ్ లైసెన్స్ రద్దు తదితర చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

జీఎస్

**వేడుకలు**

నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని , రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె సూచించారు. ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ...

బైట్ – ఎస్పీ

పిటిసి, సిరిసిల్ల

**చలి**

రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 5.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వెల్లడించింది. రాష్టంలోని పలు జిల్లాలతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉదయం పూట పొగమంచుతో రోడ్లపై వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.

పీఎన్, ఆసిఫాబాద్, సిరిసిల్ల

**బదిలీ**

సంగారెడ్డి అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ , నల్లగొండ కలెక్టర్ గా బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ గా రెండున్నర ఏళ్లపాటు పని చేశారు. పార్లమెంట్ , అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవల పంచాయతీ ఎన్నికలను కూడా విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.

పిటిసి, సంగారెడ్డి

**లంచం**

భూమి కొలతల విషయంలో నిర్మల్ జిల్లా కు చెందిన సర్వేయర్ బాలకృష్ణ వర్మ , ఆయన అసిస్టెంట్ నాగరాజు లంచం తీసుకుంటూ నిన్న సాయంత్రం ఏసీబీ అధికారులకు దొరికారు. 15 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఇద్దరూ పట్టుబడినట్లు ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు.

పిటిసి, నిర్మల్

**దివ్యాంగులు**

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం వివాహ ప్రోత్సాహకం అందిస్తోందని జగిత్యాల జిల్లా సంక్షేమశాఖ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్ తెలిపారు. ఇప్పటి వరకు దివ్యాంగులను సకలాంగులు వివాహం చేసుకున్న సందర్భంలో మాత్రమే లక్ష రూపాయల ప్రోత్సాహం అందించేవారు. ఇప్పుడు ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకున్నా ప్రోత్సాహకం అందుతుందన్నారు. జీవో సెం 7 ప్రకారం 19 మే 2025 తర్వాత వివాహం చేసుకున్న దివ్యాంగ జంటలు ఈ ప్రోత్సాహకానికి అర్హులని తెలిపారు.

పిటిసి, జగిత్యాల

**ఖమ్మం యూరియా**

ఖమ్మం జిల్లాలో 14 వేల 388 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని , రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఇప్పటి వరకు 18 వేల 982 మెట్రిక్ టన్నులను రైతులకు పంపిణీ చేశామని వెల్లడించారు.

పిటిసి, ఖమ్మం

**ఇంటర్**

ఇంటర్మీడియట్ గణితం పరీక్షలకు సంబంధించి బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. గణితంలో రెండు పేపర్ల మధ్య.. 1ఏ , 1బీ లేదా 2ఏ , 2బీల లోని కొన్ని పాఠ్యాంశాలను అటూఇటూ మార్చనున్నారు. ఒక పేపర్ సులభం.. మరొకటి కఠినం.. అన్న భావన విద్యార్థుల్లో రాకుండా పాఠ్యాంశాల సమతుల్యత పాటించాలని ఈ మేరకు ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ మార్పులు వచ్చేఏడాది ప్రథమ సంవత్సరంలో చేరేవారి నుంచి మొదలవుతాయి.

డెస్క్

**కేస్లాపూర్ నాగోబా జాతర**

కేస్లాపూర్ నాగోబా జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. నిన్న జాతర ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వచ్చే నెల 18 న మహా పూజతో జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారని అంచనా వేస్తూ, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

**పీటీసీ –నిర్మల్**